క్లుప్తంగా

సీఎంను కలిసిన క్యామ



కేసీఆర్‌ను కలిసిన మల్లేశ్

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రగతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్ప గుచ్ఛం అందజేశారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ తదితరులు

కడ్తాల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. గురువారం నార్లకుంటతండాలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి సర్పంచ్ పూజతో కలిసి జెడ్పీటీసీ భూమిపూజ చేసి మాట్లాడారు. ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, గోవిందాయిపల్లి తండా సర్పంచ్ రామునాయక్, ఉప సర్పంచ్ రాములు నాయక్, వార్డు సభ్యులు నాయకులు, రాంచందర్, సరోజ, లీలా, హున్యా, శక్రు, సరిత, రఘువీర్, కీర్యా, రాములు, హరికిషన్, పాండు, రమేశ్, హీరాసింగ్, భాస్కర్, నిరంజన్ తదితరులు ఉన్నారు.

ఏడేళ్లయినా పూర్తికాని కళాశాల భవనం



డీటీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నేతలు

ఇబ్రహీంపట్నం: ఏడేళ్లు గడిచినా ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తికాలేదని, వెంటనే పనులు ప్రారంభించి పూర్తిచేయాలని ఎన్‌ఎస్‌యూఐ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు నందకిషోర్ మాట్లాడుతూ ఏడేళ్ల క్రితం భవన నిర్మాణానికి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారని, కానీ నేటి వరకు అది పూర్తికాకపోవడం శోచనీయమన్నారు. వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేసి, భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు విప్లవ్ హరీశ్, అరుణ్, రాకేశ్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదుకోవాలి



విద్యార్థి శ్రావణ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న సర్పంచ్ తదితరులు

మంచాల: పాఠశాల స్థాయి నుంచే ఇష్టపడి చదువుకోవాలని ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం జీపీ కార్యాలయం వద్ద ఆరుట్ల మోడల్ స్కూల్‌లో పదో తరగతి పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించిన శ్రావణ్‌కుమార్‌రెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుంటే తప్పా పోటీ పరీక్షల్లో నెగ్గలేరని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గుడ్డిమల్ల చంద్రయ్య, లక్ష్మికాంత్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం



ఉత్సవంలో పాల్గొన్న మంత్రి సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: కుల మతాలకు అతీతంగా అందరూ ఐకమత్యంగా ఉండాలని మంత్రి సబితారెడ్డి అన్నారు. గురువారం సరూర్‌నగర్‌లో జరిగిన బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రామాలయం చైర్మన్ బోయిని మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బంగారు మైసమ్మ ఆలయ ట్రస్టీలు బేర బాలకిషన్, అరవింద్ కుమార్, మాజీ కార్పొరేటర్ అనితా దయాకర్‌రెడ్డి, మల్కాజిగిరి దయానంద్ కుమార్, సాతెల్లి నాగరాజు పాల్గొన్నారు.

చెరువులు నిండుగా.. పల్లెల్లో పండుగ

‘తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక దండగ అన్న వ్యవసాయం పండుగలా మారింది’ అని ప్రజాప్రతినిధులు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన చెరువుల పండుగలో పలువురు మాట్లాడారు. ‘మిషన్ కాకతీయ’తో అనుకున్న లక్ష్యం నెరవేరింది. పూడికతీతతో చెరువులు, కుంటల్లో జలకళ సంతరించుకొని, సాగునీటికి కొదవ లేకుండా పోయింది. చెరువులకు పూర్వవైభవం వచ్చి.. పల్లెలకు పండుగలా మారింది’ అన్నారు.

- అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- దశాబ్ది ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు
- బతుకమ్మ, బోనాలతో గంగమ్మ చెంత సంబురాలు



కడ్తాల్: బతుకమ్మలతో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తదితరులు

కడ్తాల్: మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వవైభవం సంతరించుకొని, జలకళతో కళకళలాడుతున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో చెరువుల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా వలలతో మత్స్యకారులు, బోనాలు, బతుకమ్మలతో మహిళలు దేవర చెరువు వద్దకు ఊరేగింపుగా వెళ్లి గంగమ్మ, కట్టమైసమ్మకు బోనాలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక దండగ అన్న వ్యవసాయం సంబురంలా మారిందన్నారు. మిషన్ కాకతీయతో చెరువులు, కుంటలు నీటితో కళకళలాడగా.. రైతన్నలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ పేదల ప్రభుత్వం అని, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని వెల్లడించారు. జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌లు ఎల్‌ఎన్‌రెడ్డి, భారతమ్మ, సేవ్యా, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు భాస్కర్‌రెడ్డి, వెంకటయ్య గౌడ్, నరేందర్‌రెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వెల్జాల్‌లో చెరువుల పండుగ ఘనంగా నిర్వహించారు. మత్స్యకారులతో కలిసి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాసుయాదవ్ ర్యాలీగా సహదేవి సముద్రం చెరువు కట్ట మైసమ్మ చెంతకు చేరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీకాంత్, ఏఈ రమేష్, రవితేజ, కార్యదర్శి శరత్, ఏఈఓ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో ఊరూరా చెరువుల పండగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చర్లపటేల్‌గూడ, రాయపోల్, దండుమైలారం, నాగన్‌పల్లి, పొల్కంపల్లి చెరువుల వద్దకు బతుకమ్మ, బోనాలతో మహిళలు డప్పు చప్పుళ్ల నడుమ ఆటపాటలతో ఊరేగింపుగా చేరుకొని, గంగమ్మకు హారతులు పట్టారు. ఎంపీపీ కృపేశ్, సర్పంచ్ గీతారాంరెడ్డి, ఎంపీటీసీ ఆంజనేయులు, ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలో ఊరూరా చెరువుల పండుగ ఘనంగా జరిగింది. మంచాలలో పోల్కమ్మ చెరువు, లింగంపల్లి సాబిత్‌నగర్, ఆగాపల్లిలో సైదుబంధం, ఆస్మత్‌పూర్ తారకుంట, నోముల ఊశమ్మ, బండలేమూర్ అచ్యుతరావు, ఆరుట్లలో మద్దిరెడ్డి, చెన్నారెడ్డి గూడలో చెన్నారెడ్డి గూడ, లోయపల్లిలో నాగులమ్మ చెరువుల వద్ద సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మలు, బోనాలతో ఊరేగింపుగా.. గంగమ్మ చెంతకు చేర్చి మొక్కులు తీర్చుకున్నారు. తహసీల్దార్ అనిత, ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బ్రాహ్మణపల్లిలో ఊరూరా చెరువుల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బతుకమ్మ, బోనాలతో ఊరేగింపుగా వెళ్లి బ్రాహ్మణపల్లి చెరువు కట్ట వద్ద అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ వలన అనేక చెరువులు పూర్వ వైభవాన్ని సంతరించుకున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా పెద్ద చెరువు

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: పర్యాటక కేంద్రంగా ఇబ్రహీంపట్నం పెద్ద చెరువును తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పెద్ద చెరువు వద్ద కట్టమైసమ్మకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కొన్నేళ్లుగా చెరువు నిండకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి నీటి కష్టాలు ఎదురయ్యాయని తెలిపారు. దీంతో రూ.16 కోట్లతో పూడికలు తీయగా.. చెరువులోకి నీరు వచ్చి అలుగుపారడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఇప్పుడు జలకళతో తొణికిసలాడుతున్న పట్నం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో రూ.12 కోట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. హుస్సేన్‌సాగర్‌లో ఏ విధంగా ఉందో అదే విధంగా టూరిజం స్పాట్‌గా ఈ చెరువును మార్చనున్నట్లు పేర్కొన్నారు. ఆర్డీఓ వెంకటచారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ సునీత, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, ఎంపీపీ కృపేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతి కిరణ్, కమిషనర్ యూసుఫ్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మత్స్యకారులు, గంగపుత్రులు పాల్గొన్నారు.



తలకొండపల్లి: వెల్జాల్‌లో..



ఇబ్రహీంపట్నం: చర్లపటేల్‌గూడలో..



మంచాల: ఆరుట్లలో..



తుర్కయంజాల్: బ్రాహ్మణపల్లిలో..

ఏం సాధించారని సంబురాలు

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: రాష్ట్రంలో ఏం సాధించారని బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు జరుపుతోందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. ధనిక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణను అప్పుల్లో ముంచారని విమర్శించారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడారు. కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదని, సకల జనులను మోసం చేసినందుకు పండుగ చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు కావొస్తున్న సందర్భంగా పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు శ్రీను, మల్లయ్య, భానుకిరణ్, మల్లేశ్‌గౌడ్, రాజేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ సంక్షేమ సంబురాలు

ఇబ్రహీంపట్నం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎస్సీ,ఎస్టీ,బీసీ శాఖల ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి గార్డెన్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు తెలంగాణ సంక్షేమ సంబురాలను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రానున్నట్లు ఆయన వెల్లడించారు.

10న లోక్ అదాలత్

తలకొండపల్లి: ఆమనగల్లు కోర్టు ఆధ్వర్యంలో ఈ నెల 10న నిర్వహించే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎస్‌ఐ వెంకటేశ్ యాదవ్ చెప్పారు. పెండింగ్ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని అనుకుంటే లోక్ అదాలత్‌ను సంప్రదించాలని సూచించారు. యాక్సిడెంట్, భూ తగాదాలు, చీటింగ్, చిట్‌ఫండ్స్, వివాహ సంబంధిత కేసులు, చోరీ, అక్రమ మద్యం, ఇటుక, ఇసుక, మట్టి, కట్టెల రవాణా పేకాట, లాక్‌డౌన్, ట్రాఫిక్, కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించబడతాయని తెలిపారు.

మైనింగ్స్‌తో దెబ్బతింటున్న పంటలు

- జీటలు వారుతున్న ఇళ్లు.. భూమిలో ఇరుక్కుపోతున్న బోర్లు
- మైన్స్ అండ్ రాక్స్ కంపెనీని మూసివేయాలి
- ప్రజాభిప్రాయ సేకరణలో బాధిత గ్రామాల ప్రజలు

కందుకూరు: మైనింగ్ కంపెనీల వలన పర్యావరణం దెబ్బతినడంతో పాటు ఇళ్లు బీటలు వారుతున్నాయని, వెంటనే వాటిని మూసివేయాలని బాధిత గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. గురువారం మీర్‌ఖాన్‌పేట సర్వే నంబర్ 112లో కొనసాగుతున్న మైన్స్ అండ్ రాక్స్ కంపెనీ అనుమతులు రెన్యూవల్ కోసం ఆర్డీఓ సూరజ్‌కుమార్ సమక్షంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. మీర్‌ఖాన్‌పేట, బేగరికంచె, వావిళ్లకుంటతండా, కుర్మిద్ద వాసులు వాటి అనుమతులు రద్దు చేయాలని కోరారు. ఆ సర్వే నంబర్‌లో ఉన్న ఇతర మైనింగ్ కంపెనీలను మూసివేయాలని డిమాండ్ చేశారు. మైనింగ్‌తో జరిగే బ్లాస్టింగ్‌లతో ఇళ్లు బీటలు వారుతున్నాయని, బోర్లు ఇరుక్కుపోతున్నాయని, దుమ్ము, ధూళితో పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మీర్‌ఖాన్‌పేట సర్పంచ్ జ్యోతిశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు కాకి రాములు, బేగరకంచె సర్పంచ్ సరశమ్మ, ఉప సర్పంచ్ పద్మ, కుర్మిద్ద సర్పంచ్ బందె రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయ సేకరణలో అనుమతులు ఇవ్వొద్దంటూ ఆర్డీఓకు విన్నవిస్తున్న ప్రజలు

అంధత్వ నివారణకు ‘కంటివెలుగు’



బడంగ్‌పేట్: అద్దాలు పంపిణీ చేస్తున్న మేయర్ పారిజాత తదితరులు

బడంగ్‌పేట్: కంటి చూపు సమస్య ఉన్నవారు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేయర్ చిగురింత పారిజాత అన్నారు. గురువారం 19వ డివిజన్ లోకాయుక్త కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నేత్ర శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అంధత్వ నివారణ కోసం ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని కంటి జబ్బు ఉన్నవారు వినియోగించుకోవాలని సూచించారు. కంటి పరీక్ష అనంతరం వైద్యులు ఉచితంగా మందులు, కళ్లద్దాలు ఇస్తారని, అవసరమైతే శస్త్ర చికిత్స చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అమిత, నాయకులు శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, మోతిలాల్, మనోహర్, ధన్వంతర్‌రెడ్డి, భాను పాల్గొన్నారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ 36వ డివిజన్ ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కాలనీలో కంటి వెలుగు శిబిరాన్ని కార్పొరేటర్ ఎడ్ల మల్లేశ్ ముదిరాజ్ ప్రారంభించి మాట్లాడారు. నేత్ర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న డివిజన్ ప్రజలు కంటివెలుగు కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఆయన కంటి అద్దాలు పంపిణీ చేశారు.

లక్ష్మీదేవిపల్లిపై ప్రభుత్వాల నిర్లక్ష్యం

- కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి,ఆల్‌ఇండియా కన్వీనర్ లక్ష్మయ్య

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం నిలిచిపోయిందని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆల్ ఇండియా కన్వీనర్ బండారి లక్ష్మయ్య ఆరోపించారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతూ ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహార దీక్షలు గురువారం 7వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు ప్రజా సంఘాలు, బహుజన సంఘాల నేతలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో మళ్లీ ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితులు రావడం పాలకులకు సిగ్గుచేటని విమర్శించారు. కోట్ల రూపాయల నిధులను వృథా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. సమస్యలపై ప్రశ్నించిన వారిపై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తుందని మండిపడ్డారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టే వరకు ఉద్యమానికి మా మద్దతు ఉంటుందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



దీప్‌లాల్‌చౌహాన్

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ బంజారా సేవా సంఘ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా దీప్‌లాల్ చౌహాన్, వైస్ చైర్మన్‌లుగా పుర్యానాయక్, కోట్యానాయక్, ప్రధాన కార్యదర్శులుగా శంకర్‌నాయక్ బాలునాయక్, కోశాధికారిగా రాములు నాయక్, సలహాదారులుగా ఇంద్రావత్ రవినాయక్, దాస్యానాయక్, పాండునాయక్, దేవుజానాయక్, హామునాయక్, శ్రీనివాస్‌నాయక్, బోనానాయక్, భవాసింగ్‌నాయక్, సంతోష్‌కుమార్, దేవానంద్, చిన్నానాయక్, సంయుక్త కార్యదర్శిగా జగన్‌నాయక్, బన్సీలాల్‌నాయక్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ దీప్‌లాల్ మాట్లాడుతూ సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ ఆలయం, బంజారా భవన్‌కు స్థలం కేటాయించిన మంత్రి సబితారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

షెడ్లు కూల్చివేత

మహేశ్వరం: మన్సాన్‌పల్లి గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 136 ప్రభుత్వ భూమిలో మహేశ్వరం గ్రామానికి చెందిన కొందరు దళితులు నిర్మించుకున్న గదులు, షెడ్లను బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. ఇదే విషయమై గురువారం మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో దళితులు ఫిర్యాదు చేశారు. తాము కష్టపడి కట్టుకున్న గదులను కూల్చినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వృత్తిదారులు వినియోగించుకోవాలి

బడంగ్‌పేట్: వెనుకబడిన వర్గాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తిదారులకు ఆర్థిక సహాయంగా రూ.లక్ష అందించనుందని, దీనిని వృత్తిదారులు వినియోగించుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు తిమ్మని గిరీష్ అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడారు. రాయితీ రుణం పొందేందుకు మహేశ్వరం నియోజకవర్గం వృత్తిదారులు ఆధార్, కులం, ఆదాయం, నివాస ధ్రువపత్రం, రేషన్‌కార్డు, ఒక ఫొటోతో మీ సేవలో ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జోరుగా చేపల విక్రయం

చేవెళ్ల: మృగశిర కార్తె సందర్భంగా గురువారం చేపలకు మంచి డిమాండ్ పలికింది. మండల కేంద్రంలో ప్రధాన రోడ్డుపక్కన ప్రత్యేకంగా చేపల దుకాణాలు వెలిశాయి. ఉదయం నుంచి ప్రజలు చేపల కొనుగోలు చేసేందుకు బారులు తీరారు. గురువారం సంత కావడంతో మండలంలోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో రావడంతో చేపల అమ్మకం జోరుగా సాగింది.

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయ బృందం

నోడల్ అధికారి జంగయ్య

కడ్తాల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, బడీడు పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని నోడల్ అధికారి జంగయ్య సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా నోడల్ అధికారి ఆధ్వర్యంలో సలార్‌పూర్, చల్లంపల్లి, వంపుగూడ, పెద్ద వేములోనిబావితండాల్లో గురువారం ఇంటింటి ప్రచారం చేశారు. పాఠశాలల్లో వసతులు, విద్యా ప్రమాణాలు, క్రీడలు, సాధించిన ప్రగతిని చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. మీమీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు విజయలక్ష్మి, శ్వేతా, ఎంపీటీసీ ప్రియ, ప్రధానోపాధ్యాయులు మల్లయ్య, ఖలీల్ అహ్మద్, లత, రాధిక, ఇందిరా, ఉపాధ్యాయులు జనార్దన్‌రెడ్డి, భాస్కర్‌రావు, నాయకులు శంకర్, భూనాథ్, రమేశ్ పాల్గొన్నారు.

విశ్రాంతి భవన నిర్మాణానికి భూమి పూజ

షాద్‌నగర్: మండలంలోని రామేశ్వరంలో ఉన్న ఉత్తర రామేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో భక్తుల కోసం విశ్రాంత భవన నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, సర్పంచ్ సంపత్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, ఆశన్నగౌడ్, చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం



కాంగ్రెస్‌లో చేరుతున్న యువకులు

డీసీసీ అధ్యక్షుడు నర్సింహా రెడ్డి

పహాడీషరీఫ్: ముస్లిం మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ సందేశ్‌నగర్‌లో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో చల్లా ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని చెప్పారు. మున్సిపాలిటీలో ముస్లింలు నివాసం ఉండే ప్రాంతాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని, తాము అధికారంలోకి వస్తే వాటి రూపురేఖలను మార్చేస్తామని చెప్పారు. పీసీసీ కార్యదర్శి అమరేందర్ రెడ్డి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, పార్టీ నాయకులు చిగురింత నర్సింహారెడ్డి, అహ్మద్ బామ్, వంగేటి మధుసూదన్ రెడ్డి, యూసుఫ్ ఖాద్రీ, ఫైజల్ ఖాద్రీ, సుల్తాన్ మీర్జా, ఉబేద్ షరీఫ్, జహంగీర్‌ఖాన్, అలీ జాబ్రీ పాల్గొన్నారు.